క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వే స్టేషన్‌లోని 4, 5 ప్లాట్‌ఫాంకు వెళ్లే ఫ్రంట్ ఓవర్ బ్రిడ్జి మెట్లపై సుమారు 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని జీఆర్పీ ఎస్సై మావుళ్లు సోమవారం తెలిపారు. మృతుడు సుమారు 5.6 అడుగుల పొడవు ఉండి నలుపు రంగులో కలిగి ఉన్నాడన్నారు. ఒంటిపై నలుపు రంగు డిజైన్ గల పొడవు చేతుల చొక్కా, లైట్ బ్రౌన్ కలర్ పొడుగు నిక్కర్, లుంగీ ధరించి ఉన్నాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అతడి వివరాలు తెలిసిన వారు 94910 03239, 0883 2442821 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

కంబాలచెరువు: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లలో సోమవారం వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇమేజింగ్, ఫణీంద్ర స్కానింగ్, జాగ్రృతి డయాగ్నోస్టిక్ సెంటర్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబు, సిబ్బంది పరిశీలించారు. వీటిలో ధరల పట్టిక లేకపోవడం, రికార్డులు సక్రమంగా లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు.

అన్నదానం మహోన్నతం



వృద్ధులకు భోజనం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: అన్నదానం మహోన్నతమైనదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శాటిలైట్‌సిటీలోని మానవీయ ఐక్యసేవ అసోసియేషన్ ఆశ్రమంలో తానేటి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జక్కంపూడి రాజా మాట్లాడుతూ వృద్ధాశ్రమం పరిస్థితిని చూస్తే మనసు చలిస్తోందని, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా దీని అభివృద్ధికి కొంత ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాయుడు కాక, కోడి కోట, తలుపులు, దాసరి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



కొత్తపేట వీహెచ్‌పీ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

కొత్తపేట: హిందువులు అందరూ ఐకమత్యంగా నిలిచి హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ స్థాపన జరిగి ఈ కృష్ణాష్టమికి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా వీహెచ్‌పీ షష్ట్యాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ జిల్లా మందిర అర్చక ప్రముఖ్ కోటిపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన సభకు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కిరెడ్డి మాట్లాడుతూ హిందువులు తమ కులాన్ని ఇంటికే పరిమితం చేసుకుని బయట మాత్రం హిందువులం, బంధువులుగా మెలగాలన్నారు. ఐకమత్యంగా హిందూ ధర్మాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గోవిందు, కోశాధికారి నూలు శ్యామల, హిందూ సంపర్క ప్రముఖ్ జెల్లి సర్వలక్ష్మి, రిటైర్డ్ ఎంఈఓ ఏడిద సత్తిరాజు, బీజేపీ జిల్లా కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

508 కలశాలతో శ్రీకృష్ణునికి మహా అభిషేకం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభూ సుందరశ్రీనివాస్‌దాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు. అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ ఈ వేడుకలకు హాజరయ్యారు. సుందర శ్రీనివాస్‌దాస్ శ్రీకృష్ణుడు లీలలను ప్రవచించారు. సాయంత్రం ఉట్టి సంబరం వేడుకలను జరిపారు. ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 12.30 గంటల వరకూ స్వామికి విశేష పూజలు జరిపారు. 508 కలశాలతో మహాభిషేకం, మహో భోగనివేదన, మహాహారతి వంటి విశేష క్రతువులు జరిపారు.

రోగికి రూ.20 వేల సాయం

మామిడికుదురు: మగటపల్లి గ్రామానికి చెందిన గోవిందవర్జుల శ్రీనివాసరావు భార్య హృద్రోగ సమస్యతో బాధపడుతున్నారు. ఆమె వైద్య సేవల కోసం నామన ఫౌండేషన్ ద్వారా సోమవారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. జెడ్పీ మాజీ చైర్మన్, ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు, డాక్టర్ నామన వినోద్ ఈ సహాయాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. ఉండ్రు శ్రీరామారావు, కుంపట్ల బాబ్జి, రమేష్, మనేంద్ర పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టం అవసరం



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటన దేశాన్నే కుదిపేసింది. పగలూరాత్రి అనే తేడా లేకుండా రోగుల ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేకపోవడం విస్మయానికి గురి చేసింది. కోల్‌కతా సంఘటనలో ఇప్పటికీ సరైన చర్యలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. లేనిపక్షంలో వైద్యవృత్తి అంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది.

– డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్యులు, రాజమహేంద్రవరం

వైద్యులకు భరోసా కల్పించాలి



ఇటీవల వైద్యులపై దాడులు చాలా ఎక్కువయ్యాయి. వాటిపై ఫిర్యాదులు చేస్తున్నా పూర్తి న్యాయం జరగడం లేదు. వైద్యవృత్తి ఎంతో ఒత్తిడితో కూడుకున్నది. దానికి పూర్తి న్యాయం చేయాలంటే వైద్యులకు భరోసా కావాలి. ఆసుపత్రులు, వైద్యులపై ఏదైనా సంఘటన జరిగితే వెంటనే యాక్షన్ తీసుకునేలా చట్టాలు చేయాలి. కోల్‌కతా సంఘటనతో వైద్యులు అందరూ అప్రమత్తమవ్వాలి. ప్రభుత్వం వెంటనే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ రౌతు పార్థసారథి, పార్థసారథి ఆర్థో ఆసుపత్రి, రాజమహేంద్రవరం

సంప్రదాయం ఉట్టిపడేలా..

- వాడవాడలా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అలరించిన చిన్నారుల వేషధారణ



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

సీటీఆర్‌ఐ: రాజమహేంద్రవరం నగరం, రూరల్ నియోజకవర్గాలలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ మందిరం, ఆర్యాపురం వద్ద గల శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఇస్కాన్ ఆలయంలో జగన్నాథ, బలరామ, సుభద్రల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే ఉత్సవం నిర్వహించారు. ఆర్యాపురం రాధాకృష్ణ మందిరంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 7 గంటలకు ఉట్టి ఉత్సవం, 7.30 నుంచి 8.30 వరకు చిన్నారుల బాలకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో తెప్పోత్సవం వైభవంగా జరిగింది. శ్రీకృష్ణ మందిరంలో బాలగోపాలునికి 108 కలశాలతో పంచామృతాభిషేకం, ఫల, పుష్పాభిషేకం నిర్వహించారు. రాత్రి 12 గంటలకు 56 రకాల పిండి వంటలతో మహారాజభోగ నివేదన, అనంతరం 108 దీపాలతో రాధాకృష్ణ, గోదావరి మాతకు మహా హారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు.

▶▶ కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలోని అనుబంధ హస్టల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధకృష్ణుల వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి, సుమిత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణతత్వం అలవర్చుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: బాల్యం నుంచి కృష్ణతత్వాన్ని అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా ఎదగడానికి కృషి చేయాలని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్ అన్నారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో సుమారు 1,200 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య శ్రీకృష్ణజన్మాష్టమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామసుందర్ మాట్లాడుతూ శ్రీకృష్ణభగవానుని గీతోపదేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శ పౌరులుగా తయారు కావడానికి నిరంతర సాధన చేయాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు శ్రీకృష్ణ, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురవయ్య, అభివృద్ధి కమిటీ సభ్యుడు టి.సోమసుందరరెడ్డి పాల్గొన్నారు.



దేవీచౌక్ లోని దశావతార సీతారామాలయంలో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



శ్రీసత్యసాయి గురుకులంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



కడియంలో ఉట్టికొడుతున్న చిన్నారులు

అలరించిన కృష్ణాష్టమి వేడుకలు

ధవళేశ్వరం: శ్రీకృష్ణాష్టమి వేడుకలు ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రీమ్స్ లిటిల్ శ్రీకృష్ణ గోపిక కాంటెస్ట్ నిర్వహించారు. చిన్నారులందరూ శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. సంప్రదాయ ఉట్టిపడేలా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల కోలాటం అలరించింది. అనంతరం జరిగిన ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఇటువంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు తెలియజేస్తాయని స్కూల్ చైర్మన్ ఎ.రమేష్ అన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ వి.సంధ్యాకుమారి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.దీపిక, ప్రీస్కూల్ ప్రిన్సిపాల్ జి.విమలారోజి, వేమగిరి డ్రీమ్స్ ఫస్ట్ స్టెప్ ప్రీస్కూల్ ప్రిన్సిపల్ కె.లలితాదేవి పాల్గొన్నారు.



ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థినులు

వాడవాడలా వేడుకలు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల గోశాలలో కొలువుదీరిన కృష్ణభగవానుడి మందిరంలో గోసంరక్షణ సేవా సమితి అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు), రామకృష్ణతులసి దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గోపూజ, అర్చనలు, అభిషేకాలు, వస్త్రాలంకరణ, వివిధ రకాల పుష్పాలు, తులసీ మాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాగోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అలాగే స్థానిక ప్రముఖులు తుమ్మా తాతానాయుడు, సత్యవేణి దంపతులు గిరజాల వీధిలోని కృష్ణుడి ఆలయంలో పూజలు చేశారు. కల్యాణ మండపం వద్ద భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు.

▶▶ కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక కృష్ణుడి గుడి వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఉట్టి ఉత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిగింది.

▶▶ కడియంలోని షిర్డీసాయి విద్యానికేతన్, డాఫ్నీ ఏషియాటిక్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూలు డైరెక్టర్ టి.నాగమణి పాలేశ్వరరావు ఆధ్వర్యంలో కృష్ణుడి జన్మవృత్తాంతాన్ని వివరించారు. రాధాకృష్ణులు, గోపికల వేషధారణతో చిన్నారులు ఆకట్టుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూలు చైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దశావతార సీతారామాలయంలో..

రాజమహేంద్రవరం సిటీ: దేవీచౌక్‌లోని దశావతార సీతారామాలయంలో ఆర్‌ఎల్ మెమెంటోస్ ఆధ్వర్యంలో బాలకృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు హాజరయ్యారు. బాలకృష్ణుల వేషధారణతో అలరించిన చిన్నారులకు జూనియర్, సినియర్ విభాగంలో బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ బంగారు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గౌరవ అతిథులుగా పంతం కొండలరావు, పీవీఎస్ కృష్ణారావు, పుచ్చల రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఆర్‌ఎల్ మెమెంటోస్ అధినేతలు మోటూరు రాజశేఖర్,రాజ్యలక్ష్మి దంపతులను పలువురు అభినందించారు.

ప్రత్యేక పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని రైల్వే హాస్పిటల్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. అనంతరం మహిళలు పారాయణ నిర్వహించారు.



ధవళేశ్వరంలో డ్రీమ్స్ విద్యార్థుల ప్రదర్శన



కడియంలో పూజలు చేస్తున్న గిరజాల బాబు దంపతులు

జక్కంపూడి రాజాకు అభినందనలు



జక్కంపూడి రాజాను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ రాజానగరం మండల నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియమితులు కావడం హర్షణీయమని రాజానగరం మండల వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిశెట్టి సోమేశ్వరావు అన్నారు. ప్రకాశం నగర్ కార్యాలయంలో జక్కంపూడి రాజాను సోమవారం రాజానగరం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకొని జక్కంపూడి రాజా నిలబడ్డారన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా జక్కంపూడి రాజాను నియమించి యువజన విభాగం బలోపేతానికి మరింత అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో నాళం రోశయ్య, వేమగిరి కృష్ణ పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయం



దుళ్లలో మదర్ థెరిసా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

కడియం: మన దేశంలో అభాగ్యులకు మదర్ థెరిసా అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆమె జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని థెరిసా విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గురప్రు కొండయ్య మాస్టార్, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు తాతపూడి బాబీ, టేకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

- పొట్టిలంక గ్రామంలోని లూథరన్ చర్చి ఆవరణలో మదర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మదర్ థెరిసా సేవా సంఘ అధ్యక్షుడు నక్కా వెంకటరత్నరాజు, కార్యదర్శి అర్థల కుమార్ బాబు తదితరులు మాట్లాడారు.

స్వర్ణాంధ్రలో..

రాజమహేంద్రవరం సిటీ: మదర్ థెరిసా బాటలో నిరంతర సేవలు అందిస్తున్న స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు లయన్స్ క్లబ్ సభ్యుడు కావడం గర్వంగా ఉందని ఆ క్లబ్ రాజమండ్రి పూర్వపు గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు కొనియాడారు. లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సోమవారం మదర్ థెరిసా జయంతి ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి లయన్స్ క్లబ్ రాజమండ్రి అధ్యక్షుడు ఎంవీఎస్ఎస్ఆర్ గుప్తా, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

వృద్ధులకు వితరణ

కంబాలచెరువు: గౌతమీ జీవకారుణ్య సంఘంలో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు సోమవారం మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. అక్కడి వృద్ధులకు పండ్లు, బిస్కట్లు, పేస్టులు, చీరలు, పంచెలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ మదర్ జయంతి సందర్భంగా 2003 నుంచి ఇప్పటివరకూ ఏటా వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీవీఎస్.నాగేశ్వరరావు, ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెల వితరణ

గోదావరి తీరంలో మార్మోగిన వేదనాదం



జగద్గురు పీఠంలో నిర్వహించిన వేదసభలో పాల్గొన్న పండితులు

సీటీఆర్‌ఐ: వేదనాదంతో గోదావరితీరం మార్మోగింది. ఏటా శ్రావణమాసంలో ప్రముఖ పరిషత్తులు, ట్రస్టులు నిర్వహించే వేదసభలకు రంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా నగరంలో పలుచోట్ల సోమవారం వేదసభలను ఘనంగా నిర్వహించారు.

వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో..

వేదశాస్త్ర పరిషత్తు 88వ వార్షిక వేదసభ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో నిర్వహించారు. పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాల ప్రదానం, పండిత సత్కారం జరిగాయి. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్టు ఆఫీసర్ ఎవీఎస్ఎస్. విభీషణశర్మ, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఎస్పీ నరసింహ కిషోర్, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

బులుసువారి వేదసభ

కళాగౌతమి ఆధ్వర్యంలో డాక్టర్ బీవీఎస్ మూర్తి నిర్వహించే వేదసభను మధ్యాహ్నం ఒంటి గంటకు గౌతమ ఘాట్‌లోని జగద్గురుపీఠంలో నిర్వహించారు. వేద పండితులను, వేద విద్యార్థులను నిర్వాహకుడు బీవీఎస్ మూర్తి సత్కరించారు.

విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి ట్రస్టు ఆధ్వర్యంలో..

భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి పేరిట ఆయన తనయుడు, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ ఏటా నిర్వహించే వేదసభ సాయంత్రం 6 గంటలకు గోదావరి గట్టున ఉన్న శృంగేరీ శారదా శంకర మఠంలో నిర్వహించారు. పలువురు వేద పండితులు పాల్గొన్నారు.

నిండు శోకంతో సంతాప దినాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో అర్బయీన్ 40 రోజుల సంతాప దినాలు నిండు శోకంతో ముగిశాయి. అంజుమన్ సంఘాలు, పంజా ధర్మకర్తల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముస్లింలు కర్బలా పుణ్యభూమిలో వందల ఏళ్ల క్రితం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాం హుస్సేన్, ఆయన పరివారం, వీర మరణం పొందడం గుర్తు చేసుకుంటూ బోరున విలపించారు.

ఆదివారం రాత్రి 40వ రోజు మృత కళేబరాల ఖననం స్మరించుకుంటూ విషాద గేయాలు ఆలపించారు. సోమవారం ముంబై నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా అఖిల్ తురాబి, మత గురువు మౌలానా మీర్జా అస్కరి హుస్సేన్‌లు మజ్లిస్‌ల రూపంలో ప్రవక్తలు అనుభవించిన కష్టాలను వివరిస్తున్నప్పుడు భక్తులు ముక్తకంఠంతో విలపించారు. గుర్రాలపై హమాలీలు ఊరేగుతూ మాతం నిర్వహించారు.

కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాలి



దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎలక్ట్రానిక్ కాటాలకు తనిఖీ చేస్తున్న జీవీ ప్రసాద్

దేవరపల్లి: గోడౌన్ల నుంచి కచ్చితమైన తూకాలతో రేషన్ సరకులు తీసుకోవాలని తూనికల, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ రేషన్ డీలర్లకు సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తనిఖీలు చేసి 2024–25 సంవత్సరానికి సీలు వేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ కాటాలకు తప్పనిసరిగా సీలు వేయించుకోవాలన్నారు. సీలు లేకుండా వినియోగదారులకు కాటాలపై సరకులను పంపిణీ చేయడం నేరమని ఆయన అన్నారు. కార్డుదారులకు కచ్చితమైన తూకంతో నిత్యావసర సరకులు అందించాలన్నారు. దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లోని రేషన్ షాపులు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద గల కాటాలకు ఆయన సీళ్లు వేయించారు. మంగళవారం గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లో తనిఖీ చేస్తామని ఆయన తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒక్కసారి సభ్యత్వ నమోదు జరగడం సర్వసాధారణమన్నారు. బీజేపీ పార్టీ ప్రతి ఆరు సంవత్సరాలకొకసారి సంపూర్ణంగా నమోదు కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో బీజేపీ సభ్యత్వం తీసుకున్నవారు 18 కోట్ల మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, రేలంగి శ్రీదేవి, బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.